
సాక్షి సూర్యాపేట

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



పప్పు దినుసుల సాగుతో ..
పప్పు దినుసుల సాగుతో పోషకాహార భద్రత సాధించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు.
- 8లో



పుష్కరఘాట్.. డేంజర్ స్పాట్
నాగార్జున సాగర్‌లోని శివాలయం వద్ద గల పుష్కర ఘాట్ సందర్శకులకు డేంజర్ స్పాట్‌గా మారింది.
- 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 35°/17°
ఆకాశం ఉదయం పొగమంచుతో మేఘావృతంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి టీసీసీ పరీక్షలు

సూర్యాపేట టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) లోయర్, హయ్యర్ గ్రేడ్స్ ఇన్ డ్రాయింగ్ (ఆర్ట్స్), టైలరింగ్ ఎంబ్రాయిడరింగ్ (క్రాఫ్ట్) పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఈ పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

జాజిరెడ్డిగూడెంలో జెడ్పీ సీఈఓ విచారణ



గ్రామపంచాయతీలో విచారణ చేస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్ కబ్జాకు గురైందని తెలంగాణ లోకాయుక్తలో కేసు నమోదు విషయమై శుక్రవారం జెడ్పీ సీఈఓ సురేష్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి విచారణ జరిపారు. బీసీ కమ్యూనిటీ హాల్ కబ్జాకు గురైందని జాజిరెడ్డిగూడెం సోషల్‌ఫోరం ప్రతినిధి చొల్లేటి రమణ తెలంగాణ రాష్ట్ర లోకాయుక్తలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఈఓ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కమ్యూనిటీ హాల్ రికార్డులను పరిశీలించారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌కు వెళ్లి భవనాన్ని పరిశీలించారు. గ్రామస్తులను విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈఈ కొండయ్య, ఎంపీడీఓ ఉమేష్‌చారి, సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు, ఎంపీఓ సందీప్‌కుమార్, ఏఈఈ అశోక్, కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డులో గల టీటీడీ కల్యాణ మండపంలో సాయిదీప్తి నర్సింగ్ హోం వారి సహకారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, కార్యదర్శి ఎల్.సంతోష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలబాలికలు తమ పేర్లను ఆదివారం ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కప్‌తో పాటు మెడల్స్ అందజేయబడతాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 8555008996 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి జానపాటి కృష్ణయ్య

నడిగూడెం : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు విద్యాధికారి జానపాటి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 36వ వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్య, కళాశాల సూపరింటెండెంట్ శాంతయ్య, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎండీ.అఫ్జల్, బుస్నా మహేష్, అధ్యాపకులు పిచ్చిరెడ్డి, కర్నాటి శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్ : జిల్లాలోని ఆయుష్, డిస్పెన్సరీల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేదం, హోమియో, యునానీలో బీఏఎంఎస్, బీయూఎంఎస్ డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నెరవేరని డబుల్ కల



సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో కూలీలకు నివాసంగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

పేదలకు అందని రెండు పడక గదుల ఇళ్లు

- మంజూరైన ఇళ్లలో పావలా వంతే పూర్తి
- వాటిల్లోనూ కల్పించని మౌలిక వసతులు
- కొన్నిచోట్ల పనులే ప్రారంభించని వైనం
- ఏళ్ల తరబడిగా తప్పని ఎదురుచూపులు



కోదాడలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని చేపట్టినా పూర్తి చేయడంలో వెనుకబడి పోయింది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాకపోగా, మరికొన్ని ప్రాంతాల్లో ప్రారంభమైనా ఏళ్ల తరబడి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తయి నెలలు గడిచినా వసతులు కల్పించకపోవడంతో అవి పంపిణీకి నోచుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు కేటాయించకముందే గోడలు పగుళ్లు వచ్చాయి. కంపచెట్లు మొలిచి శిథిల భవనాలుగా మారిపోయాయి. అయినా ఇటు అధికారులు కానీ.. అటు పాలకులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ.. ఇళ్ల నిర్మాణ ప్రగతి

'డబుల్' ఇళ్ల నిర్మాణం ప్రారంభం	2016
జిల్లాకు మంజూరైన ఇళ్లు	5,424
నిర్మాణం పూర్తయినవి	2,344
పంపిణీ చేసింది	435
నిర్మాణ దశలో ఉన్నవి	845
పనులు ప్రారంభంకానివి	1,485

ఇళ్ల పరిస్థితి ఇలా..

→ నాగారం మండలం డి.కొత్తపల్లిలో 2017లో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి, 2019లో 75 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. వర్ధమానుకోట గ్రామ శివారులో 2018లో 50 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి, 2020లో పూర్తిచేశారు. రెండేళ్లు అవుతున్నా పంపిణీ చేయడం లేదు. వాటిల్లో ఎలాంటి మౌలిక వసతులు లేవు. దీంతో ఆ ఇళ్లు ప్రారంభించకముందే పగుళ్లు వచ్చాయి.

→ కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో 560 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు దాటింది. నాలుగు నెలల కిందట వార్డుల వారీగా అర్హుల జాబితాపై అభిప్రాయసేకరణ చేసినా పంపిణీ చేయడం లేదు. మౌలిక వసతులు కల్పించలేదు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో 740 ఇళ్లను నిర్మించగా 360 ఇళ్లే పంపిణీ చేశారు. ఇంకా 380 ఇళ్లను పంపిణీ చేయాల్సి ఉంది. పలుచోట్ల అర్హులు ఎక్కువగా ఉండడంతో పంపిణీ గొడవలకు దారి తీస్తుండంతో అధికారులు వెనుకంజ వేస్తున్నారు.

→ చింతలపాలెం మండలం దొండపాడులో నాలుగేళ్ల కింద 25 ఇళ్లను నిర్మించారు. వసతులు కల్పించలేదు. పంపిణీ చేయలేదు. దీంతో వాటి చుట్టూ కంపచెట్లు పెరిగి నిరుపయోగంగా మారాయి. గ్రామంలో గుడిసెలు వేసుకుని జీవించే నిరుపేదలు తాత్కాలికంగా అక్కడి కొన్ని ఇళ్లలో ఉంటున్నారు.

→ సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో నిర్మించిన ఇళ్లు రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన కూలీల నివాసాలుగా మారిపోయాయి. అక్కడ నిర్మించిన ఇళ్లలో ఎలాంటి వసతులు కల్పించకపోవడం, వాటిని కల్పించి పంపిణీ చేయకపోవడంతో కూలీలు వాటిల్లో నివాసం ఉంటున్నారు.

నిధులు సరిపోవని..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇచ్చే రూ.5.4లక్షలు సరిపోవని పనులు చేపట్టకపోవడం, చేపట్టిన ప్రాంతాల్లో మధ్యలోనే నిలిపివేశారు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం లక్ష్యం నెరవేరకుండా పోతోంది.

వెంటనే పంపిణీ చేయాలి



కోదాడలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి రెండేళ్లు అవుతున్నా పంపిణీ చేయక శిథిలావస్థకు చేరుకున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మౌలిక వసతులను కల్పించి అర్హులకు వెంటనే పంపిణీ చేయాలి.
– కుదరవెళ్లి బసవయ్య, కోదాడ

ఇల్లు కావాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేశా



కూలీ పని చేసుకొని బతికే మాకు సొంతిల్లు లేదు. ఓ స్థలంలో గుడిసె వేసుకొని ఉంటున్నాం. ఆ స్థలం వారు వెళ్లిపొమ్మనడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్నాం. డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నా.
– ముత్తయ్య, దొండపాడు, చింతలపాలెం మండలం

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాం



మాకు సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తారని మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాం. త్వరగా పంపిణీ చేయాలి.
– ఎల్మకంటి యాకమ్మ, డి.కొత్తపల్లి, నాగారం మండలం

ఆర్‌ఎస్‌ఎస్ అండతోనే అనుచిత వ్యాఖ్యలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌పీ



రాయినిగూడెం వద్ద కార్యకర్తలతో ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట రూరల్: ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతోనే హమారా ప్రసాద్ దళిత సేన అనే ఫేక్ సంస్థను స్థాపించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ కాలంలో తాను జీవించి ఉంటే అతన్ని చంపేసేవాడినని అనడం సభ్యసమాజం తలదించుకునేలు ఉందని మండిపడ్డారు. శుక్రవారం కోదాడకు వెళ్తున్న ఆయన సూర్యాపేట మండలం రాయినిగూడెంలో ఓ హోటల్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితబంధు లాంటి పేర్లతో స్కీములు పెట్టి ఓట్ల కోసం అంబేద్కర్ జపం చేసే తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి వారిని ఎందుకు ఉపేక్షిస్తుందని, అతనిపై చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని శంకించాల్సి ఉంటుందన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో మతకల్లోలాల పేరుతో కొన్ని శక్తులు చిచ్చుపెట్టాలని చూస్తున్నాయన్నారు. అందరం ఒకే తల్లి పిల్లలలాంటి వారమని, దుష్ట రాజకీయ శక్తుల చేతుల్లో పావులుగా మారొద్దని, దాడులు చేయమని ఏ ధర్మం చెప్పలేదనే నిజాన్ని గుర్తించాలని కోరారు. ఎదుటి వారి ఆరోపణలు నచ్చకపోతే చట్టపరంగా ఫిర్యాదు చేయాలని కోరారు. కేసీఆర్‌ను ఈ మధ్య తెలంగాణ కాన్షీరాం అని అనడం హాస్యాస్పదమని, కేసీఆర్ తెలంగాణ కాన్షీరాం అయితే ప్రగతి భవన్ ఒక్కరే ఉండకుండా ఖాళీ చేయాలన్నారు. ప్రగతి భవన్ కేసీఆర్ సొత్తు కాదని.. అది ప్రజల ఆస్తన్నారు. ప్రగతి భవన్‌ను మ్యూజియంగా మార్చాలని కేసీఆర్ ఆస్తులను జాతీయం చేయాలని కోరారు.

అంబేద్కర్‌ను కించపరిస్తే ఊరుకోం



బేతవోలులో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

చిలుకూరు : అంబేద్కర్ వంటి మహనీయులను కించపరిస్తే ఎంతకైనా తెగిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతరకు హాజరైన ఆయన స్థానికంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. అంబేద్కర్‌పై దుర్మార్గంగా మాట్లాడిన పందికొక్కు హమారా ప్రసాద్ వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఉన్నాయని ఆరోపించారు. బహుజన రాజ్యంలో మన బిడ్డలు పైలెట్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, యాక్టర్లు అవుతున్నారన్నారు. బేతవోలును మండలంగా, రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్‌లో నీలిజెండా ఎగురవేయబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ పార్టీ నాయకులు పిల్లుట్ల శ్రీను, కందుకూరు ఉపేందర్, రెమిడాల నాగరాజు, రాజేందర్‌ప్రసాద్, నాగమణి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

- విద్యుత్ వినియోగదారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ దిలీప్‌కుమార్



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న చైర్మన్ దిలీప్‌కుమార్

హుజూర్‌నగర్: విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నామని విద్యుత్ వినియోగదారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ దిలీప్‌కుమార్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని విద్యుత్ డీఈ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థను ప్రభుత్వం నాలుగు విభాగాలు చేసి ప్రతి విభాగానికి జ్యుడిషియల్ అధికారాలు నియమించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో 650 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో 500 పరిష్కరించినట్టు తెలిపారు. స్థానికంగా చేసిన పరిష్కారం నచ్చకపోతే తిరిగి అంబుడ్స్‌మన్ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సదస్సులో ఫిర్యాదులు స్వీకరించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ బోర్డు టెక్నికల్ అధికారి నాగేశ్వరరావు, ఎస్ఈ పాల్ రాజ్, డీఈలు వెంకట కష్ణయ్య, శ్రీనివాస్, ఏడీఈ సక్రు నాయక్, అధికారులు రాంప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరకు పటిష్ట భద్రత కల్పించాం

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: రాష్ట్రంలోనే రెండోవ అతిపెద్దదైన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు పటిష్టమైన పోలీస్ భద్రత కల్పించామని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు 1,850 మంది సిబ్బందితో రోజుకు మూడు విడతలుగా ఐదు రోజుల పాటు భారీ బందోబస్తు నిర్వహించామన్నారు. పోలీస్ శాఖ ముందస్తు చర్యలు, ప్రత్యేక ప్రణాళికతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వాహనాలను కొత్త మార్గాలకు దారి మళ్లించామని చెప్పారు. జాతర ప్రదేశంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌తో పాటు హెల్ప్ లైన్ సెంటర్స్ ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించామన్నారు. 65 సీసీటీవీ కెమెరాలతో జాతరను నిత్యం పర్యవేక్షించామని పేర్కొన్నారు. జాతరలో తొలిసారిగా అత్యాధునిక ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ సాంకేతికతను వినియోగించామని తెలిపారు. తమ సిబ్బందికి సహకరించిన భక్తులు, వివిధ శాఖల అధికారులకు, జాతర విజవయంతానికి విస్తృత ప్రచారం కల్పించిన మీడియా సిబ్బందికి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



పాత అప్పన్నపేట పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గరిడేపల్లి: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాత అప్పనపేట, గరిడేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు– మన బడి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మన ఊరు-మన బడి పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని, కొన్నిచోట్ల మిగిలిన వాటినీ వేగతవంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్ గౌడ్, త్రిపురం సీతారాంరెడ్డి, యడవెల్లి చంద్రారెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న వెంకట్‌రెడ్డి, కడప ఇసాక్, ఎంపీడీఓ కె.వనజ, మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్, ఎంపీఓ లావణ్య, ఏఈ శ్రీనివాస్‌రావు, ప్రదీప్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి మహాక్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవంతో కల్యాణం జరిపి మహావేదనతో భక్తులను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

- కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్



కొత్త బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించవచ్చని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడ ఆర్టీసీ డిపోకు మంజూరైన 10 కొత్త బస్సులను శుక్రవారం ఆయన డిపో మేనేజర్ హర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని అన్ని విధాలుగా బలోపేతం చేస్తుందన్నారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించి లాభాల బాటలోకి పయనించేలా సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లాకు మంజూరైన 20 బస్సుల్లో కోదాడ డిపోకు ప్రభుత్వం 10 బస్సులు కేటాయించిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న క్యాంటిన్‌లో స్వచ్ఛమైన పదార్థాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిపో అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా పొన్నోత్సవం



పొన్నోత్సవంలో పాల్గొన్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి పొన్నోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలనులో గోపికలు స్నానమాచరిస్తుండగా కృష్ణుడు వారి కోకలను దొంగిలించుకుపోయిన సన్నివేశాన్ని అర్చకులు రక్తి కట్టించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పొన్నచెట్టుపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటింటికీ హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, కడారి నరేష్, ఈఓ వై.శ్రీని వాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు, పవన్, సాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

'బడి' పనులు జాప్యం



తుంగతుర్తి మండలం వెలుగుపల్లి ఎంపీపీఎస్‌లో నిర్మాణంలో ఉన్న వంట గది



పిల్లర్ల దశలోనే ఆగిన టాయిలెట్ల నిర్మాణం

- నత్తనడకన 'మనఊరు–మనబడి'
- ఈ నెల 1న నాలుగు స్కూళ్లే ప్రారంభం
- మిగతా వాటిల్లో ఇంకా పూర్తికాని పనులు
- నెలాఖరు వరకు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశం

నిధుల ఖర్చు ఇలా..

ఎంపిక చేసిన పాఠశాలలు	కేటాయించిన నిధులు
329	రూ.117.31 కోట్లు
ఇప్పటి వరకు ఖర్చు చేసింది	రూ.8.59 కోట్లు

సూర్యాపేట టౌన్: కనీస వసతులు కల్పించి సర్కారు స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనఊరు-మనబడి కార్యక్రమం జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది. ఈ కార్యక్రమం కింద మొదటి విడతలో ఎంపిక చేసిన స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం రూ.117.31 కోట్ల నిధులు మంజూరు చేసింది.

మొదటి విడతలో 329 పాఠశాలలు ఎంపిక..

మొదటి విడతలో ఈ విద్యా సంవత్సరంలో మన ఊరు-మనబడి కింది 329 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో మొదట మండలానికి రెండు చొప్పున పాఠశాలలను ప్రారంభించేలా ప్రణాళిక తయారు చేసుకున్నారు. 2023-24 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే జిల్లాలోని 23 మండలాల నుంచి రెండేసి చొప్పున మొత్తం 46 పాఠశాలల్లో ఇప్పటి వరకు పనులు పూర్తి కావాల్సి ఉండగా కేవలం ఏడు పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. ఇందుకు ఇప్పటి వరకు సుమారు రూ.8.59కోట్లు ఖర్చు చేశారు. మిగతా వాటిల్లో పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే చాలా పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్లు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్, డైనింగ్ హాల్స్, నూతన తరగతి గదులు, శిథిలావస్థలో ఉన్న గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం, డ్యూయల్ డెస్కులు, అల్మారా, కుర్చీలు తదితర వాటిని సమకూర్చాల్సి ఉంది.

ఏడు స్కూళ్లను ప్రారంభించాల్సి ఉన్నా..

జిల్లాలో ఎంపిక చేసిన వాటిలో ఏడు పాఠశాలలను ఈ నెల 1వ తేదీ నాటికి ప్రారంభించాల్సి ఉండగా నాలుగు పాఠశాలలను మాత్రమే ప్రారంభించారు. మిగతా మూడు పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదు. అలాగే ఈ నెల 10వ తేదీ నాటికి మండలానికి రెండు చొప్పున ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటి వరకు కోదాడలో ప్రాథమిక పాఠశాల, అనంతగిరి మండలం అమీనాబాద్ ప్రాథమిక పాఠశాల, చివ్వెంల మండల కేంద్రంలో పీఎస్, సూర్యాపేట మండలం రాయినిగూడెం ప్రాథమికోన్నత, మట్టపల్లి మండలం అల్లిపురం ప్రాథమిక పాఠశాల, మేళ్లచెరువులోని పీఎస్ దళితవాడ పాఠశాలలో పనులు పూర్తి చేశారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీలు, డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, నల్లాలు, టాయిలెట్స్, పాఠశాలలకు రంగులు వేసే పనులు పూర్తి చేశారు. ఇదిలా ఉంటే ఈ నెలాఖరు వరకు మండలానికి రెండు చొప్పున పూర్తి చేసి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు.

నెలాఖరు వరకు పూర్తవుతాయి

జిల్లాలో చేపట్టిన మనఊరు-మన బడి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఏడు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి మండలానికి రెండు చొప్పున ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో వంట గదులు, టాయిలెట్లు, రంగులు వేయడం వంటి పనులు కొనసాగుతున్నాయి.
– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

రహదారి దిగ్బంధనంలో పెద్దఎత్తున పాల్గొనాలి



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

చౌటుప్పల్ : ఈనెల 13న నిర్వహించనున్న హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి దిగ్బంధానికి పార్టీలకతీతంగా పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ శ్రేణులతో అత్యవసర భేటీ నిర్వహించారు. దిగ్బంధనం విజయానికి గ్రామాల వారీగా కమిటీలను ప్రకటించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఊరు నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల చంద్రస్వామి, బోయ లింగ స్వామి, దేవేందర్, ఊదరి శ్యామ్, నర్సింహ, మహేష్, సుక్క అర్జున్, స్వామి, యాదయ్య, వెంకటేష్, లింగస్వామి, తదితరులు ఉన్నారు.

డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మృతి



ఎలమంద

నల్లగొండ రూరల్ : డీవీఎం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్డ ఎలమంద(90) అనారోగ్యం కారణంగా శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని చర్లపల్లిలోని డీవీఎం బీఈడీ కళాశాలలో ఉంచి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కుమారుడు దొడ్డ నాగరాజు, శాంతికుమార్ పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో నాగరాజు, శ్రీధర్, శ్రీదేవి, నారాయణరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నా రు. కాగా.. దొడ్డ ఎలమంద 1979లో డీవీఎం ఎడ్యుకేషనల్ సొసైటీని, రామగిరిలో పాఠశాలను, 1980లో బీఈడీ కళాశాలను ఏర్పా టు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను దగ్గర చేశారు.


బ్రిక్స్ కంపెనీపై కేసు

నకిరేకల్ : ఇటుక బట్టీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పని చేయిస్తుండడంతో బ్రిక్స్ కంపెనీపై నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ బైపాస్‌లోని సాయిప్రియ హోటల్ సమీపంలో ఉన్న వీజేఎం బ్రిక్స్ కంపెనీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రోజు వారి కూలి డబ్బులు ఇవ్వకుండా రోజు 16 గంటల నుంచి 18 గంటలు పనులు చేయించుకుంటున్నారు. సమాచారం మేరకు నకిరేకల్ తహసీల్దార్ ప్రసాద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటయ్య, ఎస్ఐ రంగారెడ్డి శుక్రవారం సదరు వీజేఎం బ్రిక్స్ కంపెనీ వద్ద విచారణ చేశారు. విచారణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 10 కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకుంటున్నట్లు తేలడంతో సదరు కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. సదరు కార్మికులకు వేతనాలు ఇప్పించి వారి రాష్ట్రానికి పంపించినట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

పుష్కరఘాట్.. డేంజర్ స్పాట్

సాగర్ శివాలయ పుష్కరఘాట్ వద్ద కానరాని రక్షణ చర్యలు

- స్నానానికి నదిలోకి దిగి వరద ఉధృతికి కొట్టుకుపోతున్న పర్యాటకులు
- గడిచిన నాలుగేళ్లలో 37మంది మృతి



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ వద్ద కృష్ణానదిలో వరద ఉధృతికి తట్టుకోలేక నీటమునిగి పర్యాటకులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. నదీ తీర ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాద హెచ్చరికల బోర్డుల ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు ప్రమాదాలకు గురవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 2022 ఆగస్టు 12న సాగర్‌కు విహారయాత్రకు వచ్చి తిరుగుప్రయాణంలో అక్కంపల్లి జలాశయంలో ఈత కొట్టడానికి దిగి ముగ్గురు నీటమునిగి మరణించారు. ఈ సంఘటన మరవకముందే గురువారం నాగార్జునసాగర్‌లోని శివాలయం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతికి కొట్టుకపోయి ముగ్గురు మృతిచెందారు. నదీతీర ప్రాంతంలో ఫెన్సింగ్ ఉండి, హెచ్చరిక బోర్డులు ఉంటే వారు నీటిలోకి దిగే సాహసం చేసి ఉండే వారు కాదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాజెక్టు, రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, పర్యాటక అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పుష్కరఘాట్ వద్ద జరిగిన ప్రమాదాల్లో మృతుల సంఖ్య

సంవత్సరం	మరణాలు
2019	10
2020	8
2021	8
2022	7
2023	4 (ఫిబ్రవరి 10 వరకు)

గడిచిన నాలుగేళ్లలో..

2019 నుంచి 2023 ఫిబ్రవరి 10వ తేదీ వరకు సాగర్ జలాశయం, కృష్ణానదిలో పడిన ఘటనలో 37మంది మృతిచెందారు. సాగర్ వద్ద నీటిలో పడి దిగువ ప్రాంతాలకు కొట్టుకుపోయినవారే కాకుండా కేవలం నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనలే చాలా ఉన్నాయి. దయ్యాలగండి ప్రాంతం పెద్దవూర పోలీస్టేషన్ పరిధిలో నెలకో సంఘటన జరుగుతూనే ఉంటుంది.

సుమారు 10కిలోమీటర్ల నదీతీరం..

జలాశయతీరం, నదీతీరం సుమారుగా 10కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రాజెక్టు ఎగువన దయ్యాలగండి పుష్కరఘాట్, డౌన్ పార్కు పుష్కరఘాట్ (లాంచీస్టేషన్)లు ఉన్నాయి. డ్యాం దిగువన శివాలయం ఘాట్‌తోపాటు చింతలపాలెం రోడ్డులోని సురికి ఆంజనేయ పుష్కరఘాట్‌లు ఉన్నాయి. గతంలో సాగర్‌డ్యాం దిగువన నీరు పారుతూ ఉండేది. టెయిల్‌పాండ్ డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత ఎప్పుడు సాగర్‌డ్యాంను ఆనుకోని నీరు నిలబడి ఉంటుంది. కృష్ణానదికి వరదలు వచ్చి సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తిన సమయంలో ఆ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. జలాశయతీరంతో పాటు కృష్ణాతీరంలోని నీటిలోకి దిగుతారు. అంతేకాకుండా మత్స్యకారుల పుట్టీల్లో ఎక్కి జలాశయంలో తిరుగుతుంటారు. వరద ఉధృతికి పుట్టీ బోర్లా పడితే ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉంది.

అతి ప్రమాదకరమైన ప్రాంతం

సాగర్‌డ్యాం దిగువన గల శివాళయం పుష్కరఘాట్ అతిప్రమాదకరమైనది. ఇక్కడ స్నానాలకు దిగి చాలామంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఎగువన విద్యుదుత్పాదన కేంద్రం ఉండటంతో 8యూనిట్ల ద్వారా విద్యుదుత్పాదనతో నీటిని విడుదల చేస్తారు. సైరన్ మోగించిన తర్వాతే నీటిని విడుదల చేసినప్పటికీ ఆ సైరన్ ఒక్కోసారి నీటి సవ్వడికి పర్యాటకులకు వినపడకపోవచ్చు. నిముషాల్లోనే వరద నీటి ఉధృతి పెరగడం, సందర్శకులు తేరుకోక ముందే వరద సుడులు తిరుగుతూ రావడంతో నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.



పుట్టీల్లో విహరిస్తున్న పర్యాటకులు (ఫైల్)

ముగిసిన అంత్యక్రియలు

కృష్ణానదిలో నీటమునిగి మృతిచెందిన ముగ్గురి అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. గురువారం రాత్రి మృతదేహాలు లభ్యం కాగా స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున రెండు గంటలకు పోస్టుమార్టం నిర్వహించారు. కేశవపంతుల వెంకటేశ్వర శర్మ కుమారుడు వాచస్పతి మృతదేహం, శర్మ బావమరిది హరికీర్తి నాగరాజు మృతదేహాలను హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు తరలించారు. ఉప్పలచంద్రకాంత్ మృతదేహాన్ని పైలాన్‌కాలనీలోని వారి ఇంటికి తరలించారు. శుక్రవారం వాచస్పతి, నాగరాజుల అంత్యక్రియలు బోడుప్పల్‌లో జరిగాయి. చంద్రకాంత్ అంత్యక్రియలు పైలాన్‌కాలనీలోని శ్మశానవాటికలో నిర్వహించారు. నాగరాజు కుమారుడు హరికీర్తి హర్షిత్ ఉపనయనం శుక్రవారం జరగాల్సి ఉండగా తండ్రి మరణంతో నిలిచిపోయింది.

సామూహిక ఉపనయన మహోత్సవం



ఉపనయనం అందజేస్తున్న ఎమ్మెల్సీ సురభిదేవి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సత్ర భవన్‌లో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే శుక్రవారం సామూహిక ఉపనయన మహోత్సవం నిర్వహించారు. తుని శ్రీసచ్చిదానంద తపోవన శ్రీమఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామిజీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంలో బ్రాహ్మణ కుటుంబాల్లో 9ఏళ్లకే ఉపనయనాలు చేసే వారని, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఆలస్యంగా ఉపనయనాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవి ప్రసాదరావు మాట్లాడుతూ బ్రాహ్మణులు ఆర్థిక స్తోమత లేని కారణంగా ఉపనయనం చేసుకోలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, అర్చకులు తదితరులున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



మాట్లాడుతున్న సీఐటీయూ నేత భూపాల్

నల్లగొండ రూరల్ : కార్మికుల వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని దీపకుంటలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాద చర్యలతో కార్మికవర్గంలో చీలికలు తెచ్చి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4కోడ్‌లుగా విభజించి బడా పారిశ్రామిక వేత్తలకు కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతన జీఓను సవరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 17 వరకు పారిశ్రామిక రంగంలో ఉన్న అన్ని కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించి 18, 19వ తేదీల్లో సమీక్ష నిర్వహించి ప్రణాళికలు నిర్వహిస్తామన్నారు. మార్చి 1న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేష్, ప్రమీల, సలీం, సైదులు, నారబోయిన శ్రీనివాస్, దండెంపల్లి సత్తయ్యగౌడ్, యాదయ్య, లింగస్వామి, గౌతమ్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా ఊంజలి సేవ



అండాళ్ అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ, తిరువీధిలో సేవను ఊరేగించారు. ఇక ప్రధానాలయం, ముఖమండపం, ప్రాకార మండపంలో సుప్రభాతం, ఆరాధన, అర్చన, సుదర్శన హోమం, నిత్య కల్యాణం తదితర కైంకర్యాలు చేపట్టారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల పట్టివేత



పోలీసులకు పట్టుబడిన వాహనాలు

చౌటుప్పల్ : ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, శివారు ప్రాంతాలైన అత్తాపూర్, షాద్‌నగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల నుంచి సేకరించిన చికెన్ వర్థాలను 4వాహనాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దపాడు మండల కేంద్రానికి తరలిస్తున్నారు. వీటిని ఆ ప్రాంతంలోని చెరువుల్లో చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వాహనాల డ్రైవర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కారు బోల్తా... ఒకరు మృతి

- 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- వివాహానికి వెళ్లి వస్తుండగా బుజిలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఘటన



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

మోత్కూరు : వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామం 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన దొండ లింగయ్య ఆయన భార్య నీలమ్మ, చిన్న కూతురు, అల్లుడు నాగం అరుణ, నాగం ప్రకాష్, వీరి కూతుళ్లు ప్రీతి, శ్రవణ్‌లతో పాటు లింగయ్య పెద్ద కూతురు పిల్లలు ఇందుశ్రీ, స్మిత, లింగయ్య వియ్యంకుడు నాగం బలరాంలతో కలిసి కారులో రామన్నపేటలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బుజిలాపురం సబ్‌స్టేషన్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వర్రెలో పడిపోగా డ్రైవింగ్ చేస్తున్న అతడి చిన్న అల్లుడు నాగం ప్రకాష్ (35) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఈమె పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నలుగురు చిన్నారులకు స్థానిక శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి క్లినిక్‌లో చికిత్స అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.జానకిరాం రెడ్డి సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన చిన్నారులను పోలీస్ వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీసీపీ తనిఖీ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ

బీబీనగర్ : బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను ఎస్ఐను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం శ్రీ లింగబసవేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన త్వరలో జరగబోయే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు జాతరకు వస్తున్నందున అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కల్యాణ మహోత్సవం అగ్ని గుండాల సమయంలో అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణానికి మద్యం దరిచేరకుండా జాగ్రత్త పడాలన్నారు. పార్కింగ్ తదితర స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్య, బీబీనగర్ ఎస్సై సైదులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

మేళ్లచెరువు : ప్రమావశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చవ్వ వీరయ్య(60) స్థానికంగా జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వచ్చి సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఉన్న బావి అరుగుపై కూర్చున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయి మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానికుల సాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌టీపీతోనే ప్రజా సంక్షేమం

పాలకవీడు: వైఎస్సార్‌టీపీతోనే ప్రజా సంక్షేమ పాలన అందనుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. గురువారం రాత్రి మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో వివిధ పార్టీకు చెందిన కుటుంబాలు వైఎస్సార్ టీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్, మద్యం స్కాముల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏఒక్క హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోలేకపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్ అమలు చేసిన ప్రతీ పథకాన్ని పేదలకు వర్తించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ రాముడు, మండల అబ్జర్వర్ రవీందర్‌రెడ్డి, భాస్కర్, యశోదరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : రైలు ఢీకొన్న ఘటనలో శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎండీ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం పట్టణానికి చెందిన ఎండీ అబ్దుల్‌కదీర్ (60) ఉదయం 8:30 గంటల సమయంలో ఆలేరుకు వచ్చాడు. కిమీ 265బై34 వద్ద డౌన్‌లైన్ పట్టాల సమీపం నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుకగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో అతడి తల వెనుక భాగం పూర్తిగా చిట్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

ఆలేరురూరల్ : గాయాలతో పడి ఉన్న వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆలేరులోని రెడ్డిగూడెం శివారులో రైల్వే వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉండడంతో రైల్వే పోలీసులు గుర్తించి ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. రైలులో భిక్షాటన చేస్తూ రైలు నుంచి జారిపడి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నామని రైల్వేపోలీసులు తెలిపారు.

భువవనగిరిలో దొంగల బీభత్సం

భువనగిరి : పట్టణ శివారులోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న పలు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కలెక్టరేట్ ఎదురుగా ఉన్న 3టీ, భోజనం షాపులకు సంబంధించి రేకులపై కప్పులు తొలగించి అందులోకి ప్రవేశించారు. అందులో ఉన్న సుమారు రూ.85 వేల నగదుతో పాటు పలు రకాల వస్తువులను అపహరించుకువెళ్లినట్లు బాధితులు తెలిపారు.

తెలంగాణలో దొరల పాలన

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దొరల పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి ఆరోపించారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల 266, 267, 268, 269 బూత్ కమిటీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జి మేకల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజా గోస బీజేపీ భరోసా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనపై ప్రజలకు వివరిస్తూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారమిస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం గడ్డిపల్లి మాజీ సర్పంచ్ రామినేని ప్రభాకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం, అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు నర్సింగ్ వెంకటేశ్వర్లు, సోమయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కోటయ్య, అంజయ్య, శ్రీనివాస్, నాగసైదులు, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఎయిమ్స్ వైద్య విద్యార్థుల క్షేత్ర పర్యటన



బొమ్మలరామారంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను బీబీనగర్ ఎయిమ్స్ వైద్య విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విద్య, ఫిజికల్ యాక్టివిటీస్, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోని మెనూ, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత విధానాలు, ప్రథమ చికిత్స, నీటి, అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్ షాక్, ప్రాణ హాని, అంటు వ్యాధుల నివారణ గురించి పాఠశాల విద్యార్థులకు బోధించే విధానాలను స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ స్టాలిన్ బాబు వివరించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఉపేంద్ర, డాక్టర్ శివరాం, రవి నాయక్, పర్యవేక్షకులు క్రిష్ణామూర్తి, భాస్కర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుతో పోషకాహార భద్రత

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి : పప్పు దినుసులను ప్రోత్సహించడం ద్వారా పోషకాహార భద్రత సాధించవచ్చని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలో పప్పు ధాన్యాల సాగు విస్తరణకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పప్పు దినుస్సుల్లో 25శాతం వరకు మాంస కృత్తులు ఉంటాయని, వీటితో పాటు పొటాషియం, పాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, జింక్, ఫోలేట్, థయామిన్, నియాసిన్‌లు ఉంటాయని పేర్కొన్నారు. తినే ఆహారంలో పప్పు దినుసులు చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ పెరగకుండా ఉండడంతోపాటు, గుండె జబ్బులు రాకుండా ఉంటాయని తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద కేవీకే ద్వారా క్లస్టర్ స్థాయిలో పప్పు దినుసులైన కంది, పెసర, మినుము పంటలపై ఎంపిక చేసిన రైతుల క్షేత్ర స్థాయిలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకు కావాల్సిన విత్తనాలు, కీలక ఉత్పత్తులను రైతులకు అందజేసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో లయోలా కళాశాల వ్యవసాయ విద్యార్థినులు మహేశ్వరి, సౌమ్య, ప్రవళిక, శరణ్య, శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, నరేష్, మాధురి, రైతులు పాల్గొన్నారు.